TELANGANA RISING 2047

RNI.No. TELTEL/2010/32434

# అన్వేష నేత్రం

ఎడిటర్ : గోళ్ల రమేష్

తెలుగు దినపత్రిక

సంపుటి :11 సంచిక : 333 | శనివారం 14 మార్చి 2026 | హైదరాబాద్ | పేజీలు : 8 , రూ.1.00



## మేం లొంగి పోలేదు.. అరెస్ట్ చేశారు.. దేవ్‌జీ

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ గత ఫిబ్రవరి నెలలో ప్రత్యేక ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) పోలీసుల ఎదుట లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఆయనతో పాటు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, రాష్ట్ర కమిటీ సభ్యుడైన నర్సింహారెడ్డితో పాటు మొత్తం 25 మంది పోలీసుల ఎదుట లొంగిపోయారు.



## హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం.. బూడిదైన ఫర్నిచర్..

నగరంలోని చందానగర్ ప్రాంతంలో ఉన్న ఒక ఫర్నిచర్ దుకాణంలో గురువారం అర్ధరాత్రి తర్వాత భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దుకాణంలోని ఐదు అంతస్తుల్లో నిల్వ చేయబడిన ఫర్నిచర్ మొత్తం తగలబడింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంది.

వార్త 2లో



## ఇరాన్ నాయకులు భూమి పైనుంచి తుడిచిపెట్టుకు పోయారు: ట్రంప్

ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇరాన్ వైమానికదళం కూడా ఇక ఉండదు అని అన్నారు. ఇరాన్ కు మరోసారి ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు.

వార్త 2లో

## తెలంగాణలో గ్యాస్ సిలిండర్ల

# కొరత లేదు

- వినియోగదారులకు సరిపడా గ్యాస్
- ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన పని లేదు
- ప్రజల్లో నెలకొన్న అపోహాలను తొలగించాలి
- గ్యాస్‌ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు
- ఆస్పత్రులకు, ప్రభుత్వ వసతి గృహాలకు సరిపడా గ్యాస్
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



తెలంగాణ రాష్ట్రంలో గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గ్యాస్ గృహ వినియోగదారులు గందర గోళానికి గురికాకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. గృహ వినియోగదారులకు సరిపడా గ్యాస్ సరఫరా చేస్తామని తెలిపారు. ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన పని లేదని పేర్కొన్నారు. గ్యాస్ కొరతపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈరోజు (శుక్రవారం) సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.

వార్త 2లో



## ‘తప్పనిసరి చేస్తే మహిళలను ఎవరూ ఉద్యోగాల్లోకి తీసుకోరు’: సుప్రీంకోర్టు

మహిళా ఉద్యోగులకు ‘నెలసరి’ సెలవుల అంశం మీద దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇవాళ (శుక్రవారం) కీలక వ్యాఖ్యలు చేసింది. దేశ వ్యాప్తంగా మహిళలకు, విద్యార్థినులకు అనివార్య నెలసరి లీవ్ అమలు చేయాలని కోరుతూ దాఖలైన పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్‌ను కోర్టు తిరస్కరించింది.

### పిటిషన్ వివరాలు:

న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో, నెలసరి సమస్యల వల్ల బాధపడే మహిళలకు, విద్యార్థినులకు ప్రత్యేక లీవ్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోరారు. అలాగే, మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ 1961లోని సెక్షన్ 14ని సమర్థవంతంగా అమలు చేయాలని, దాని ఆధారంగా మెన్స్ట్రువల్ లీవ్ పాలసీ తీసుకురావాలని అభ్యర్థించారు.

వార్త 2లో

## మూసీ ప్రాజెక్ట్‌కు బీజేపీ

# వ్యతిరేకం కాదు

- కాని పేదల ఇళ్లు కూల్చడాన్ని మాత్రం వ్యతిరేకిస్తాం
- మూసీ నది తప్పకుండా పునరుజ్జీవనం కావాలి
- ఆ ఇళ్లను కూల్చకుండానే మూసీని శుద్ధి చేయవచ్చు
- రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం



మూసీ ప్రాజెక్ట్‌పై బీజేపీకి వ్యతిరేకత లేదని.. కాని పేదల ఇళ్లు కూల్చడాన్ని మాత్రం వ్యతిరేకిస్తామని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా రాంచందర్ రావు శుక్రవారం హైదరాబాద్‌లో మాట్లాడారు. మూసీపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పట్ల బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.

వార్త 2లో

## గ్యాస్, పెట్రోల్ కొరతకు

# కేంద్రమే కారణం..

గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రప్రభుత్వమే కారణమని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కేంద్రప్రభుత్వ వైఫల్యంతోనే గ్యాస్ సమస్య వచ్చిందని ఫైర్ అయ్యారు. తెలంగాణలో గ్యాస్ కొరతపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. (శుక్రవారం) మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. యుద్ధం నేపథ్యంలో కేంద్రం తక్షణం స్పందించాలని పట్టుబట్టారు.



వార్త 2లో



## తెలంగాణలోని బుల్డోజర్ పాలన

# రాహుల్ గాంధీకి కనిపించటం లేదా?

కేవలం పేదల ఇళ్లు కూల్చటం గురించి మాత్రమే ఈ ప్రభుత్వం ఆలోచి స్తోందని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయం ఇచ్చేందుకు డబ్బులు లేవంటున్నారని, ఈ ప్రభుత్వ ప్రాధాన్యతలో రైతులు, పేదలు, మహిళలు, విద్యార్థులు లేరు అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..డబ్బులు లేవంటున్న సర్కార్ రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ అంటోందని, ఉద్యోగులకు రిటైర్ మెంట్ బెనిఫిట్స్ ఇచ్చేందుకు డబ్బులు లేవంటున్నారని తెలియజేశారు.

వార్త 2లో

## జాతీయ రహదారిపై ట్రావెల్ బస్సు బోల్తా.. నలుగురు మృతి

హైదరాబాద్:

నిజామాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందల్వాయి మండలం గన్నారం వద్ద 44వ జాతీయ రహదారిపై అర్ధరాత్రి ట్రావెల్ బస్సు బోల్తా పడింది. నలుగురు మృతి చెందగా.. పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించారు. బస్సు హైదరాబాద్ నుంచి 22 మందితో అకోలా వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. సహాయక చర్యలు చేపట్టారు. రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో క్రేన్ సహాయంతో వాహనాన్ని పక్కకు తొలగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదు

వినియోగదారులకు సరిపడా గ్యాస్

ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన పని లేదు

ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాలి

గ్యాస్‌ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు

ఆస్పత్రులకు, ప్రభుత్వ వసతి గృహాలకు సరిపడా గ్యాస్

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంలో గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గ్యాస్ గృహ వినియోగదారులు గందరగోళానికి గురికాకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గృహ వినియోగదారులకు సరిపడా గ్యాస్ సరఫరా చేస్తామని తెలిపారు. ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన పని లేదని పేర్కొన్నారు. గ్యాస్ కొరతపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈరోజు (శుక్రవారం) సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రధానంగా గ్యాస్ నిల్వలు, అంతర్జాతీయ పరిస్థితులపై మంత్రి ఉత్తమ్ సమీక్షించారు. ఈ సమావేశానికి సీఎస్, కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, గ్యాస్, ఆయిల్ కంపెనీలు, లీగల్ మెట్రలాజీ అధికారులు హాజర య్యారు. ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాలని మార్గనిర్దేశం చేశారు. గ్యాస్‌ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని స్పష్టం చేశారు. గ్యాస్ గృహ వినియోగదారులకు ఎక్కడ అసౌకర్యం కలిగించేలా చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గ్యాస్‌ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే ఎక్కడికక్కడ చర్యలు చేపట్టాలని.. కలెక్టర్లకు, సీపీలకు, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రులకు, ప్రభుత్వ వసతి గృహాలకు సరిపడా గ్యాస్ సరఫరా చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## 'తప్పనిసరి చేస్తే మహిళలను ఎవరూ ఉద్యోగాల్లోకి తీసుకోరు': సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, అన్వేషనేత్రం ప్రతినిధి

మహిళా ఉద్యోగులకు 'నెలసరి' సెలవుల అంశం మీద దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇవాళ (శుక్రవారం) కీలక వ్యాఖ్యలు చేసింది. దేశ వ్యాప్తంగా మహిళలకు, విద్యార్థినులకు అనివార్య నెలసరి లీవ్ అమలు చేయాలని కోరుతూ దాఖలైన పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్‌ను కోర్టు తిరస్కరించింది.

**పిటిషన్ వివరాలు:**

న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో, నెలసరి సమస్యల వల్ల బాధపడే మహిళలకు, విద్యార్థినులకు ప్రత్యేక లీవ్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోరారు. అలాగే, మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ 1961లోని సెక్షన్ 14ని సమర్థవంతంగా అమలు చేయాలని, దాని ఆధారంగా మెన్స్ట్రువల్ లీవ్ పాలసీ తీసుకురావాలని అభ్యర్థించారు.

**సుప్రీంకోర్టు వైఖరి:**

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని బెంచ్ ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ముఖ్యంగా జజీ× పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఇందులో రెండు పార్శ్వాలు ఉన్నాయి. నెలసరి సెలవులు ఇస్తే ఉద్యోగాల్లో చేరేందుకు మరింతమంది మహిళలను ప్రోత్సహించినట్లవుతుంది. అయితే, వీటిని తప్పనిసరి చేయాలని యజమానులను బలవంతపెడితే అది ప్రతికూల పరిస్థితులకు దారితీయొచ్చు. చట్టం ద్వారా అనివార్యంగా నెలసరి సెలవులు ఇవ్వాలంటే, ఎవరూ మహిళలను ఉద్యోగాలకు తీసుకోరు. సంస్థల యాజమాన్యాల మనస్తత్వం మీకు తెలియదు! వాలంటరీగా సెలవులు ఇస్తే బాగుంది.. కానీ చట్టం చేసి కంపల్సరీ చేస్తే... జ్యుడీషియరీలో, గవర్నమెంట్ జాబ్స్‌లలో కూడా తీసుకోరు. నెలసరి వల్ల ఏదో చెడు జరుగుతోంది అన్నట్టుగా చూపిస్తే, మహిళలను ఆత్మనూన్యతకు గురిచేసేలా ఉంటుంది' అని జజీ× అభిప్రాయపడ్డారు. అయితే, సంబంధిత అధికారులు అన్ని స్టేక్‌హోల్డర్లతో చర్చించి నెలసరి లీవ్ పాలసీ రూపొందించే అంశాన్ని పరిశీలించాలని ఆదేశిస్తూ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.

**నేపథ్యం:**

కేరళ రాష్ట్రంలోని స్కూళ్లలో ఆడపిల్లలకు నెలసరి లీవ్ రిలాక్సేషన్ ఇస్తున్నారు. కొన్ని ప్రైవేట్ కంపెనీలు వాలంటరీగా మహిళలకు నెలసరి సెలవులు ఇస్తున్నాయి. దేశవ్యాప్తంగా కూడా దీని మీద కంపల్సరీ చట్టం చేయాలని న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఇవాళ ఈ పిటిషన్ మీద సుప్రీంకోర్టులో విచారణ జరిగింది.

## మేం లొంగిపోలేదు.. అరెస్ట్ చేశారు.. దేవ్‌జీ

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ గత ఫిబ్రవరి నెలలో ప్రత్యేక ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) పోలీసుల ఎదుట లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఆయనతో పాటు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, రాష్ట్ర కమిటీ సభ్యుడైన నర్సింహారెడ్డితో పాటు మొత్తం 25 మంది పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ విషయాన్ని రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి నిర్ధారించారు. దేవ్‌జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'మేం లొంగిపోలేదు.. అరెస్ట్ చేశారు. గణపతి ఎక్కడున్నాడో మాకు తెలియదు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ క్షీణించింది. ప్రభుత్వంతో పోరాటం సాధ్యం కాదు. 2023లో చివరిగా సెంట్రల్ కమిటీ సమావేశం జరిగింది. 2023 తర్వాత పార్టీకి దిశా నిర్దేశం చేయడం సాధ్యం కాలేదు. మావోయిస్టు పార్టీ అనేది ఒక రాజకీయ పార్టీ. పార్టీ నడవాలంటే డబ్బులు కావాల్సి ఉంటుంది. డబ్బు రూపకంగా కాకుండా.. ఉన్న డబ్బుతో బంగారాన్ని కొనుగోలు చేస్తే బాగుంటుందని భావించా. బంగారాన్ని కొనుగోలు చేశాం'..'అయితే.. కిలోల కొద్దీ బంగారం.. కోట్ల రూపాయల డబ్బు ఉంది అని మాపైన, పార్టీపైన దురుద్దేశంతో ప్రచారం జరిగింది. నేను రాజకీయ జీవితాన్ని ప్రారంభిస్తున్నాను అంటే అందరూ అపార్థం చేసుకున్నారు. పార్లమెంటరీ వ్యవస్థలోని ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ అవ్వాలని నా మనసులో లేదు. ప్రజల్లో ఉండి ప్రజల కోసం లీగల్‌గా పోరాటం చేయడమే నా రాజకీయ జీవితం. జైల్లో ఉన్నవారిని విడుదల చేయాలని కోరాం' అని అన్నారు.

## మూసీ ప్రాజెక్ట్‌కు బీజేపీ వ్యతిరేకం కాదు

కాని పేదల ఇళ్లు కూల్చడాన్ని మాత్రం వ్యతిరేకిస్తాం

మూసీ నది తప్పకుండా పునరుజ్జీవనం కావాలి

ఆ ఇళ్లను కూల్చకుండానే మూసీని శుద్ధి చేయవచ్చు

తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

మూసీ ప్రాజెక్ట్‌పై బీజేపీకి వ్యతిరేకత లేదని.. కాని పేదల ఇళ్లు కూల్చడాన్ని మాత్రం వ్యతిరేకిస్తామని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా రాంచందర్ రావు శుక్రవారం హైదరాబాద్‌లో మాట్లాడారు. మూసీపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పట్ల బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. మూసీ నది పునరుజ్జీవనానికి కానీ.. మూసీ ప్రాజెక్ట్‌ను కానీ బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకించలేదని తెలిపారు. మూసీ నది హైదరాబాద్ నగరం నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని.., అందులో స్వచ్ఛమైన నీరు ప్రవహించాలని.. ఆ నీరు రైతులకు సాగునీటి కోసం ఉపయోగపడాలని తమ పార్టీ కోరుకుంటోందని తెలిపారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు పదే పదే తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి కానీ, మంత్రి పొన్నం ప్రభాకర్ కానీ.. బీజేపీపై రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కానీ మూసీ విషయంలో బీజేపీ వైఖరి మొదటి నుంచీ ఒకటేనని గుర్తు చేశారు. మూసీ నది తప్పకుండా పునరుజ్జీవనం కావాలని తమ పార్టీ ఇప్పటికీ చెబుతుందన్నారు. కానీ 'గాంధీ సరోవర్' పేరుతో అక్కడ నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాల ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదన్నారన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించిన ఇళ్లను కూల్చాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆ ఇళ్లను కూల్చకుండానే మూసీని శుద్ధి చేయవచ్చునన్నారు.

## గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రమే కారణం..

యుద్ధం నేపథ్యంలో కేంద్రం తక్షణం స్పందించాలి

మూసీపై తెలంగాణ ప్రభుత్వానికి ఓ విజన్

పీపీటీ ద్వారా అన్ని అనుమానాలు నివృత్తి

తుషార్ గాంధీకి తప్పుడు సమాచారం

మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజం

హైదరాబాద్,

గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రప్రభుత్వమే కారణమని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కేంద్రప్రభుత్వ వైఫల్యంతోనే గ్యాస్ సమస్య వచ్చిందని ఫైర్ అయ్యారు. తెలంగాణలో గ్యాస్ కొరతపై కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈరోజు(శుక్రవారం) మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. యుద్ధం నేపథ్యంలో కేంద్రం తక్షణం స్పందించాలని పట్టుబట్టారు. మూసీపై తెలంగాణ ప్రభుత్వానికి ఓ విజన్ ఉందని స్పష్టం చేశారు. పీపీటీ ద్వారా అన్ని అనుమానాలు నివృత్తి చేస్తామని తెలిపారు. మూసీపై గాంధీ మనవడు తుషార్ గాంధీకి తప్పుడు సమాచారం అందినట్లుందని అన్నారు.

**మూసీ నిర్వాసితులకు న్యాయం చేస్తాం..**

మూసీ నిర్వాసితులకు న్యాయం చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా కల్పించారు. మూసీ పరిసరాలను కాలుష్యం లేకుండా సుందరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం.. బూడిదైన ఫర్నిచర్..

హైదరాబాద్: అన్వేషనేత్రం ప్రతినిధి

నగరంలోని చందానగర్ ప్రాంతంలో ఉన్న ఒక ఫర్నిచర్ దుకాణంలో గురువారం అర్ధరాత్రి తర్వాత భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దుకాణంలోని ఐదు అంతస్తుల్లో నిల్వ చేయబడిన ఫర్నిచర్ మొత్తం తగలబడింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంది. 7 ఫైర్ ఇంజన్లు, 11 వాటర్ ట్యాంకర్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. దుకాణం ఐదు అంతస్తుల భవనంలో ఉండటం, లోపల సోఫాలు, బెడ్‌లు, టేబుల్స్ తదితరాలు ఉండడం వల్ల మంటలు వేగంగా వ్యాపించినట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదానికి కారణం ఏంటనేది తెలియాల్సి ఉంది. షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీకేజీ లేదా ఇతర కారణాలు ఉండవచ్చని భావిస్తున్నారు. పోలీసులు, అగ్నిమాపక అధికారులు సంయుక్తంగా ఘటన స్థలంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదం కారణంగా చందానగర్ ప్రాంతంలో కొంత వరకూ సేవలకు అంతరాయం కలిగినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తెలంగాణలోని బుల్డోజర్ పాలన రాహుల్ గాంధీకి కనిపించటం లేదా?: హరీష్ రావు

హైదరాబాద్:

కేవలం పేదల ఇళ్లు కూల్చటం గురించి మాత్రమే ఈ ప్రభుత్వం ఆలోచిస్తోందని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయం ఇచ్చేందుకు డబ్బులు లేవంటున్నారని, ఈ ప్రభుత్వ ప్రాధాన్యతలో రైతులు, పేదలు, మహిళలు, విద్యార్థులు లేరు అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..డబ్బులు లేవంటున్న సర్కార్ రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ అంటోందని, ఉద్యోగులకు రిటైర్ మెంట్ బెనిఫిట్స్ ఇచ్చేందుకు డబ్బులు లేవంటున్నారని తెలియజేశారు. మున్సిపల్ ఎన్నికలు అయిపోగానే రైతు భరోసా వేస్తామన్నారని..ఇప్పటివరకు లేదు అని హరీష్ రావు విమర్శించారు. కమీషన్ల కోసమే.. భారీ అంచనా వ్యయంతో మూసీ ప్రాజెక్టు అంటున్నారని, మూసీ ప్రాజెక్టు కోసం ఇప్పుడు 10 వేల ఇళ్లు కూలగొడతామని ఆర్డర్ ఇచ్చారని మండిపడ్డారు. మూసీని శుద్ధి చేసేందుకు 3,279 ఎకరాల భూమి ఎందుకు? అని ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి సర్కార్ పేదల ఇళ్లపై బుల్డోజర్లతో యుద్ధం చేస్తోందని, తెలంగాణలోని బుల్డోజర్ పాలన కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి కనిపించటం లేదా? అని.. కనీసం డిపిఆర్ లేకుండా పేదల ఇళ్లు కూల్చడానికే ఎందుకు సిద్ధమయ్యారు? అని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టుకు డిపిఆర్ సిద్ధం చేశారా..ప్రజల ముందు పెట్టాలని సూచించారు. డిపిఆర్ రూపొందించడానికి 18 నెలలు పడుతుందని 2 నెలల క్రితమే చెప్పారని అన్నారు. మూసీలో చేసేది బ్యూటిఫికేషనా.. లూటిఫికేషనా..? అని హరీష్ రావు ప్రశ్నించారు.

## ఇరాన్ నాయకులు భూమి పైనుంచి తుడిచిపెట్టుకుపోయారు: ట్రంప్

వాషింగ్టన్:

ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇరాన్ వైమానికదళం కూడా ఇక ఉండదు అని అన్నారు. ఇరాన్ కు మరోసారి ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మతి చెడిన నేతలకు ఇవాళ ఏం జరుగుతుందో మీరే చూస్తారని, ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయని తెలియజేశారు. ఇరాన్ నాయకులు భూమి పైనుంచి తుడిచిపెట్టుకుపోయారని, 47 ఏళ్లుగా ఇరాన్ అమాయకులను పొట్టన పెట్టుకుంటున్నారని విమర్శించారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా తాను వారిని అంతం చేస్తున్నానని, తనకు ఈ అవకాశం రావడం ఎంతో గొప్ప గౌరవం అని ట్రంప్ పేర్కొన్నారు.



## మార్కెట్లకు యుద్ధం సెగ... కుప్పకూలిన సూచీలు

1470 పాయింట్లు నష్టపోయిన

సెన్సెక్స్, 488 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ

అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి, మెటల్ షేర్లు భారీగా పతనం

డాలర్‌తో పోలిస్తే సరికొత్త రికార్డు కనిష్ఠ స్థాయికి చేరిన రూపాయి

హైదరాబాద్: అన్వేషనేత్రం ప్రతినిధి

మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు భారత స్టాక్ మార్కెట్లను కుదిపేశాయి. అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం మరింత తీవ్రరూపు దాల్చుతుందన్న భయాలతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు తెగబడ్డారు. దీంతో శుక్రవారం ట్రేడింగ్‌లో సూచీలు భారీ నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఏకంగా 1,470.50 పాయింట్లు పతనమై 74,563.92 వద్ద స్థిరపడింది. మరోవైపు నిఫ్టీ 488.05 పాయింట్లు కోల్పోయి 23,151.10 వద్ద ముగిసింది. గ్యాస్ సరఫరాకు అంతరాయం ఏర్పడవచ్చని, ఇంధన ధరలు పెరగొచ్చని ఇన్వెస్టర్లు ఆందోళన చెందడంతో అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. మార్కెట్లలో అస్థిరతను సూచించే ఇండియా విక్స్ ఇండెక్స్ 5.23 శాతం పెరిగి 22.65 స్థాయికి చేరింది. బెంచ్‌మార్క్ సూచీలతో పాటు బ్రాడర్ మార్కెట్లు కూడా కుదేలయ్యాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 2.62 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 2.52 శాతం మేర పతనమయ్యాయి. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ ఏకంగా 5 శాతం నష్టపోయింది. పీఎస్‌యూ బ్యాంక్, మీడియా సూచీలు కూడా భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్‌లో భారతీ ఎయిర్ టెల్, హిందుస్థాన్ యూనిలీవర్ మినహా మిగిలిన అన్ని షేర్లు నష్టాల్లోనే ముగిశాయి. ఎల్ అండ్ టీ, టాటా స్టీల్, ఎస్‌బీఐ, మారుతీ సుజుకీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మరోవైపు, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ వరుసగా రెండో వారం కూడా బలహీనపడి, సరికొత్త రికార్డు కనిష్ఠ స్థాయికి చేరింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడమే ఈ పతనానికి కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. నిఫ్టీకి 23,100 వద్ద తక్షణ మద్దతు ఉందని, 23,450-23,500 స్థాయి నిరోధకంగా పనిచేస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత

కొంతకాలంగా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న హెచ్‌జే దొర

హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్

ఇవాళ డయాలసిస్ చేయించుకుని ఇంటికి వెళ్లాక తీవ్ర అస్వస్థత

నిమ్స్ కు తరలించిన కుటుంబ సభ్యులు

చికిత్స పొందుతూ మృతి

హైదరాబాద్: అన్వేషనేత్రం ప్రతినిధి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర (82) కన్నుమూశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ఇవాళ విషమించడంతో, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. హెచ్ జే దొర కొంతకాలంగా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారు. ఆయన క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఇవాళ ఉదయం హైదరాబాద్ లోని నిమ్స్ లో డయాలసిస్ చేయించుకుని ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత ఆయన బాత్రూంలో పడిపోయినట్టు తెలుస్తోంది. హెచ్‌జే దొర తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు నిమ్స్ కు తరలించారు. అత్యవసర చికిత్స అందించినప్పటికీ డాక్టర్ల ప్రయత్నాలు ఫలించలేదు. 1965 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన హెచ్‌జే దొర శ్రీకాకుళం జిల్లాకు చెందినవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీజీపీగా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఆయన విశేష సేవలు అందించారు. ముఖ్యంగా, రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదాన్ని (నక్సలిజం) అణచివేయడంలో కీలక పాత్ర పోషించి గుర్తింపు పొందారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌గా, సీఐఎస్‌ఎఫ్ డైరెక్టర్ జనరల్‌గానూ జాతీయ స్థాయిలో పలు ఉన్నత పదవులు చేపట్టారు. దొర 1996లో డీజీపీగా ప్రమోషన్ పొందారు. ఆయన తన సుదీర్ఘ వృత్తి జీవితానుభవాలతో 'జర్నీ త్రూ టర్బ్యులెంట్ టైమ్స్' పేరుతో ఆత్మకథను కూడా రచించారు.



# పెరుగుతున్న ఎండల తీవ్రత

### జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

**హైదరాబాద్,**

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మరింత వేడెక్కిస్తున్నాయి. ఉదయం 8 గంటలకే సూరీడు సుర్రుమంటున్నాడు. రాయలసీమ, గోదావరి జిల్లాల్లో ఎండలు తీవ్రం అవుతున్నాయి. తెలంగాణతో పాటు హైదరాబాద్ నగరంలో కూడా ఎండలు దంచికొడుతున్నాయి. భానుడి భగభగలతో నగర ప్రజలు విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం 40-42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే.. ముందు ముందు పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, బయటికి రాకుండా చూసుకోవాలి. రోజుకు తప్పని సరిగా నాలుగు లీటర్ల నీరు తాగితే డీహైడ్రేషన్ నుంచి బయటపడవచ్చు. పిల్లలపై ఎండ ప్రభావం పడకుండా పలుచని నూలు వస్త్రాలు ధరింపజేయాలి. ఉదయం 9 గంటలకే ఎండ వేడిమి అధికం కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అతి ముఖ్యమైన పని ఉంటేనే బయటకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఎండల నుంచి రక్షణ పొందేందుకు కొన్ని జాగ్రత్తలు పాటించాలి వైద్యులు సూచిస్తున్నారు. ఈ ఎండాకాలంలో మనుషులతో పాటు, పశువులకు కూడా ఆరోగ్య చర్యలు అవసరమని సూచిస్తున్నారు. ఎండను తాళలేక కొందరు ఎక్కువ సార్లు స్నానం చేయడం మంచిది కాదు. శరీరం బలహీనపడుతుంది. ఒక్కోసారి శరీరం ఉష్ణోగ్రతలు ఉండాల్సిన దానికంటే దిగువకు పడిపోతాయి. దీంతో స్పృహకోల్పోవడం, ఒక్కోసారి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. డీహైడ్రేషన్‌కు గురికుండా ఉండేందుకు ఎక్కువ సార్లు నీరు తాగాలి. బయటకు వెళ్లేవారు వెంట మంచి నీరు తీసుకెళ్లాలంటున్నారు. దాహర్తిని తీర్చేందుకు పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, శీతల పానీయాలు తాగడం ఆరోగ్యానికి మంచిది. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ముఖ్యమైన పనులపై బయటికి వెళ్లేవారు తప్పని సరిగా తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వేసుకొని వెళ్లాలని, పాదరక్షలు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.



# న్యాయవ్యవస్థలో అవినీతి రచయితలు

### వారిని దూరంపెట్టాలన్న సుప్రీం ధర్మాసనం

**న్యూఢిల్లీ,**

జాతీయ విద్యా పరిశోధనా శిక్షణ మండలి ఎన్సీఈఆర్టీ 8వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో 'న్యాయ వ్యవస్థలో అవినీతి' పాఠ్యాంశాన్ని చేర్చేందుకు కారకులైన వారిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ ముగ్గురు నిపుణులతో ఇకపై ఎలాంటి సంబంధాలు కొనసాగించొద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. న్యాయ వ్యవస్థలో నెలకొన్న అవినీతి గురించి వివాదాస్పద అంశంగా పాఠ్యపుస్తకంలో చేర్చడంపై ఎన్సీఈఆర్టీ.. సర్వోన్నత న్యాయస్థానానికి బేషరతుగా క్షమాపణలు చెప్పడంతో పాటు ఆ పుస్తకాన్ని ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ వివాదాస్పద పాఠ్యాంశాన్ని ప్రొ.మైఖేల్ డానినో సహా టెక్స్ట్‌బుక్ డెవలప్‌మెంట్ టీమ్ సభ్యులు సుపర్ణ దివాకర్, అలోక్ ప్రసన్న కుమార్‌లు రూపొందించారని ప్రభుత్వం తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. 'ప్రొ.మైఖేల్ డానినో, ఆయన సహచరులు సుపర్ణ దివాకర్, అలోక్ ప్రసన్న కుమార్‌లకు భారత న్యాయవ్యవస్థను గురించిన సరైన పరిజ్ఞానం లేకుండా ఉండాలి, లేదా విద్యార్థుల ముందు న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేందుకు వాళ్లు ఉద్దేశపూర్వకంగానే వాస్తవాలను వక్రీకరించి తప్పుగానైనా చూపించి ఉండాలి' అని పేర్కొంది. ఇకపై రాబోయే తరం విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాల రూపకల్పన పక్రియలో ఆ ముగ్గురి ప్రమేయం ఉండకూడదని, వారిని తక్షణమే పక్కనపెట్టాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ నిధులతో పూర్తిగా లేదా పాక్షికంగా సంబంధమున్న ఎలాంటి బాధ్యతలనూ అప్పగించకూడదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవ్యవస్థ గురించి విద్యార్థులకు బోధించడం మంచి విషయమే అయినప్పటికీ.. సంబంధిత పాఠ్య ప్రణాళిక తయారీలో కనీసం ఒక్క న్యాయ నిపుణుడికీ అవకాశం కల్పించకపోవడం తమకు అసంతృప్తి కలిగిస్తోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎన్ఈసీఆర్టీ లీగల్ స్టడీస్‌కు సంబంధించి పాఠ్యప్రణాళిక రూపకల్పనలో న్యాయ రంగానికి చెందిన నిపుణులతో వారం రోజుల్లోగా ఓ కమిటీని ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ కమిటీలో మాజీ సీనియర్ న్యాయమూర్తి, ఓ ప్రసిద్ధ న్యాయవాది సహా ప్రముఖ విద్యావేత్త ఒకరుంటే బాగుంటుందని అభిప్రాయపడింది. వీరు నేషనల్ జ్యుడీషియల్ అకాడమీతో సంబంధం ఉన్నవారైతే మరింత మంచి విషయాన్ని పొందుపరిచేందుకు అవకాశముంటుందని తెలిపింది. వివాదాస్పద ఎన్సీఈఆర్టీ పాఠ్య పుస్తకాన్ని పూర్తిగా నిషేధిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఫిబ్రవరి 26న తీర్పు వెలువరించగా.. దానిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరిగినట్లు ధర్మాసనం గుర్తుచేసింది. ఈ ప్రచారం వెనుక ఉన్న సామాజిక మాధ్యమ వేదికలు, వ్యక్తుల వివరాలను తమకు అందజేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కోర్టు తీర్పులను వక్రీకరిస్తూ ఇష్టానురీతిన వ్యాఖ్యలు చేసేవారి విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేసింది.

# నిరసలను లెక్క చేయని అమెరికా అధ్యక్షుడు

### వాణిజ్య సుంకాలపై కోర్టు తీర్పు బేఖాతర్

### సెక్షన్ 301 తో దాడికి దిగబోతున్న ట్రంప్

**వాషింగ్టన్,**

ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎడాపెడా విధించిన సుంకాలు చెల్లవంటూ అగ్రరాజ్య సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన క్రమంలో ట్రంప్ కొత్త ఎత్తులు వేస్తున్నారు. యుద్ధంతో దేశీయంగా తీవ్ర నిరసనలు వస్తున్నా లెక్క చేయడం లేదు. ఇతరదేశాలపై ఎలాగైనా టారిఫ్‌లు వసూలుచేయాలని కంకణం కట్టుకున్న ట్రంప్.. ఇందుకోసం కొత్తదారులు వెతుకుతున్నారు. తాజాగా 'సెక్షన్ 301' ఆయుధాన్ని బయటకు తీశారు. దీనికింద భారత్, చైనా సహా 16 వాణిజ్య భాగస్వామ్య దేశాలపై దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు అమెరికా వాణిజ్య శాఖ ప్రతినిధి జెమిసన్ గ్రీర్ కీలక ప్రకటన చేశారు. 1974 వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 కింద.. భారత్, చైనా, యూరోపియన్ యూనియన్, సింగపూర్, స్విట్జర్లాండ్, నార్వే, ఇండోనేసియా, మలేసియా, కాంబోడియా, థాయ్‌లాండ్, దక్షిణ కొరియా, వియత్నాం, తైవాన్, బంగ్లాదేశ్, మెక్సికో, జపాన్ దేశాలపై ఈ దర్యాప్తు జరగనుందని గ్రీర్ వెల్లడించారు. కాగా.. ఈ జాబితాలో కెనడా లేకపోవడం గమనార్హం. ఇతర దేశాలు అనుసరిస్తున్న అన్యాయమైన వాణిజ్య విధానాలను సవాలు చేసేందుకు అమెరికాకు ఉన్న శక్తిమంతమైన ఆయుధమే ఈ సెక్షన్ 301. తమ వాణిజ్య భాగస్వాములు అనుసరిస్తున్న ట్రేడ్ పాలసీలు అమెరికా వ్యాపారాలు, ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాయా? అనేదానిపై ఈ చట్టం కింద అమెరికా దర్యాప్తు చేసేందుకు వీలు లభిస్తుంది. ఒకసారి దర్యాప్తు ప్రారంభించిన తర్వాత.. అన్యాయమైన వాణిజ్య విధానాలపై అగ్రరాజ్యం సాక్ష్యాలను సేకరించే పనిలో ఉంటుంది. ఏదైనా దేశం తమకు నష్టం కలిగించేలా ట్రేడ్ పాలసీలను అనుసరిస్తుందని తేలితే.. ప్రపంచ వాణిజ్య సంస్థ అనుమతి లేకుండానే ఆ దేశంపై ఏకపక్షంగా చర్యలు తీసుకునేందుకు ఈ చట్టం కింద అధికారం ఉంటుంది. అలాంటి దేశాలపై చట్టబద్ధంగా భారీ సుంకాలు విధించడం లేదా ప్రతీకార చర్యలు తీసుకునేందుకు అమెరికాకు మార్గం లభిస్తుంది. చైనా లాంటి ప్రత్యర్థులతో పాటు భారత్ వంటి మిత్రపక్షాల పైనా అమెరికా ఈ దర్యాప్తు చేపట్టడం చర్చకు దారితీసింది. భారత్‌లోని కొన్ని వాణిజ్య విధానాల వల్ల మన మార్కెట్లపై అమెరికాకు పరిమితులు ఉంటున్నాయని చాలాకాలంగా అగ్రరాజ్యం ఆందోళన వ్యక్తంచేస్తోంది. కొన్ని ఉత్పత్తులపై భారత్ అమలుచేస్తోన్న అధిక సుంకాలు, స్థానిక తయారీ, డేటా స్టోరేజీ, టెక్నాలజీ నిబంధనలు వంటివాటిపై అమెరికా అభ్యంతరాలు తెలుపుతోంది. ఈ అంశాల పైనే కొన్నేళ్లుగా ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే, తాజా దర్యాప్తుతో భారత్‌పై వెంటనే పెనాల్టీలు పడే అవకాశం లేనప్పటికీ.. భవిష్యత్తులో కొన్ని రంగాలపై ఇది ప్రతికూల ప్రభావం చూపించే ప్రమాదం ఉంది. దీంతో ఆయా రంగాల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# గ్యాస్ కొరతతో హోటళ్లు మూత

### హాస్టళ్ల పరిస్థితి మరింత దారుణం

### ఆర్టీసీ క్రాస్‌రోడ్ బావర్చి మూసివేత

### ప్యారడైజ్ హోటల్ కూడా అదే దుస్థితి

### బ్లాక్ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవన్న అధికారులు

**హైదరాబాద్,**



వంటగ్యాస్ కొరత హోటల్ పరిశ్రమను అతలాకుతలం చేస్తోంది. ఇక్కడ హాస్టళ్లో ఉంటూ చదువుకుంటున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే దుర్భర పరిస్థితి నెలకొంది. అలాగే హోటల పరిశ్రమపై ఆధారపడ్డ నిరుద్యోగులు కూడా ఆందోళన చెందుతున్నారు. మహానగరంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల



సరఫరా నిలిచిపోయింది. వంటగ్యాస్ సిలిండర్ల సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనివాస్ తెలిపారు. సిలిండర్లను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయిల్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేశామని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. నెలకు ఒక సిలిండర్ బుకింగ్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పశ్చిమాసియా యుద్ధం పీజీ యజమానుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. ఓవైపు గ్యాస్ కొరతతో నగరంలోని పలు హోటళ్లను తాత్కాలికంగా మూసేస్తుంటే, మరోవైపు హాస్టళ్ల నిర్వహణపై యజమానులు మల్లగుల్లాలుపడుతున్నారు. కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ల సరఫరా బుధవారం నుంచి నగరంలో దాదాపుగా ఆగిపోవడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారింది. గ్యాస్ వినియోగం ఎక్కువ అయ్యే దోసె, పూరీ, చపాతీ వంటకాలను తాత్కాలికంగా అన్ని హాస్టళ్లలో నిలిపివేసినట్లు సమాచారం. గ్యాస్ కొరత తీరేవరకు అన్నం, సాంబారు, కూరతో సాధారణ భోజనాన్ని మాత్రమే అందించగలమని ఐటీకారిడార్‌లోని హాస్టల్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ప్రకటించారు. చికెన్, కోడిగుడ్డుకూర, వేపుళ్లు వంటి అదనపు వంటలను నిలుపుదలచేస్తున్నట్లు తెలిపారు. టీ, కాఫీ లాంటివాటిని అందించలేమని వెల్లడిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో మూడు, నాలుగు రోజులుగా సిలిండర్ల బుకింగ్ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. సర్వర్ డౌన్‌తో బుకింగ్ కావడం లేదంటున్నారు. వాట్సాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం ఉన్నా కావడం లేదంటున్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని బావర్చి హోటల్‌ను బుధవారం మూసేశారు. గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగానే మూసేసిన్నట్లుగా తెలిసింది. ప్రముఖ ప్యారడైజ్ హోటల్స్ అన్ని బ్రాంచీలలో టీ అమ్మకాలను నిలిపివేశారు. ఐటీసీ సంస్థ కూడా వివిధ ప్రాంతాల్లో గల సంస్థ హోటల్స్‌లో గ్యాస్ కొరత కారణంగా లంచ్, డిన్నర్ ఉండదని ప్రకటించింది. ఒకవేళ దొరికినా కొన్ని ప్రాంతాల్లో రూ. 4 వేలకు, మరికొన్ని ప్రాంతాల్లో రూ. 3,500కు విక్రయిస్తున్నారు. 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర సాధారణంగా రూ.2105ల వరకు ఉంది. బుధవారం నుంచి కమర్షియల్ సిలిండర్ల సరఫరా పూర్తిగా బంద్ అయింది. పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో కూడా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను నిలిపివేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా లేకపోవడం, మార్కెట్‌లో అధిక ధర ఉండడంతో కొనుగోలు చేయలేక పలు హోటల్స్ మూత పడుతున్నాయి. సిలిండర్ కొరతతో హోటల్స్ మూసేస్తున్నట్లు యజమానులు ప్రకటించారు. అవసరమైతే అవసరమైతే కట్టెల పొయ్యి మీద వంట చేస్తామని చెప్పారు. ఇక పలు ప్రాంతాల్లో టిఫిన్ సెంటర్‌లో కమర్షియల్ సిలిండర్ సరఫరా లేకపోవడంతో హోటల్ మూసివేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టిఫిన్ సెంటర్ బందు చేసుకోవాల్సి వస్తదేమోనని ఆందోళన చెందారు. అఫ్జల్‌గంజ్, బేగంబజార్‌లో కొన్ని టిఫిన్ సెంటర్లలో గ్యాస్ లేకపోవడంతో మూసేస్తున్నారు. వేల రూపాయలు పెట్టి సిలిండర్ కొనుగోలు చేసి వ్యాపారం ఎలా చేస్తామని చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ కొరతతో పలు ప్రాంతాల్లో బిర్యానీ సెంటర్లు మూతపడ్డాయి. పలు ప్రాంతాల్లో వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు దొరక్కపోవడంతో టీ షాపులు, బండి వ్యాపారులు, టిఫిన్ సెంటర్ల నిర్వహకులు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాడుతున్నారు. కొందరూ గృహ వినియోగదారులు 14కిలోల గ్యాస్ సిలిండర్‌ను రూ.1800ల వరకు అమ్ముతున్నారు. గ్యాస్ సిలిండర్ల కొరతతో హోటళ్లు మూతపడుతున్నాయి. గృహావసరాల సిలిండర్ల సరఫరా తగ్గింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే రూ.5 భోజనానికి ఇబ్బంది ఉండదని జీహెచ్ఎంసీ వర్గాలు చెబుతున్నాయి. విద్యుత్‌తో నడిచే యంత్రాలతో భోజనం తయారు చేస్తున్న దృష్ట్యా గ్యాస్ కొరత ప్రభావం తయారీపై ఉండబోదని జీహెచ్ఎంసీ అధికారి ఒకరు తెలిపారు. సిలిండర్లకు ప్రత్యామ్నాయ మర్గాలను నిర్వాహకులు అన్వేషిస్తున్నారని అమీర్‌పేట హాస్టళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు చెబుతున్నారు. బుధవారం అమీర్‌పేట ప్రాంతంలోని హాస్టల్ నిర్వాహకులు 120కుపైగా ఎలక్ట్రికల్ స్టౌలు కొనుగోలు చేసినట్లు సమాచారం. కొందరు కట్టెల పొయ్యి ఏర్పాటుచేసుకున్నారని దుర్గానగర్ హాస్టళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ చెప్పారు. గ్యాస్ కొరత నేపథ్యంలో హాస్టళ్ల యజమానులంతా ఒక్కటయ్యారు. నిర్వహణ విషయంలో తాత్కాలిక నిబంధనలు రూపొందించి అమలుచేస్తున్నారు.

విద్యా, ఉద్యోగ అవకాశాల కోసం నగరానికి వచ్చిన యువతకు ఆశ్రయమిచ్చే పేయింగ్ గెస్ట్ హాస్టళ్ల నిర్వహణ ఇప్పుడు మరింత భారంగా మారింది. మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కోర్సులు నేర్చుకోడానికి వచ్చే విద్యార్థుల సంఖ్య




ఏడాదిగా బాగా తగ్గింది. దాంతో ప్రైవేటు హాస్టళ్ల వ్యాపారం మందకొండిగా నడుస్తోంది. గ్యాస్ కొరత మమ్మల్ని మరింత నష్టాల్లోకి నెడుతుంది. ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నాం. హాస్టల్‌లో ఉంటున్నవారికి అన్నం, కూర, సాంబారైనా వడ్డించడానికి ప్రత్నిస్తున్నాం అంటున్నారు.

# రైతులను బలహీనం చేసేలా చట్టాలు

**అమరావతి,**

పేద రైతు, కౌలు రైతు కేంద్రంగా ఉన్న వ్యవసాయాన్ని చట్టాల ద్వారా కార్పొరేట్లకు కట్టబెట్టడానికి మార్గం సిద్ధం చేస్తున్నారనేది స్పష్టంగా తెలుస్తుంది. వ్యవసాయ సంక్షోభం, యువరైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయేగాని తరగడం లేదు. అందుకుగల కారణాలను, పరిష్కారాలను కనిపెట్టడంలో ప్రభుత్వం వైపు నుండి వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. చంద్రబాబు నాయుడు రాష్ట్ర అసెంబ్లీలో 'డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్' పత్రాన్ని ప్రవేశ పెట్టినప్పుడు కొన్ని ముఖ్యాంశాలను ప్రస్తావించారు. స్వర్ణాంధ్ర 2047 సాధించే సమయానికి వ్యవసాయరంగంపై ఆధారపడే జనాభా 60 శాతం నుండి 10 శాతానికి పడిపోతుందని అంచనా వేస్తున్నారు. నేడున్న వ్యవసాయ భూములు కూడా 30 శాతం చాలవని అంటున్నారు.. మిగతాది అవసరం లేదన్న ధోరణి కనిపిస్తోంది. అంటే ఆ భూములను ఎవరికైనా అమ్ముకోవచ్చన్న ధోరణి కనిపిస్తోంది. వ్యవసాయ రంగంలో మిగిలిపోయే మిగతా 50 శాతం జనాభాను పట్టణాలకు తరలించి వారిని చీప్ లేబర్‌గా వాడుకోవచ్చన్న దుర్మార్గ ఆలోచన కూడా ఇందులో ఇమిడి ఉంది. కేంద్ర ప్రభుత్వం సైతం ఈ సంవత్సరం 100 లక్షల ఎకరాలను అమ్మకానికి సిద్ధం చేసింది. నూతన నీటి విధానం' ప్రకారం కాలువలకు, పొలాలకు మీటర్లు పెట్టి నీటి వాడకాన్నిబట్టి రైతుల నుండి చార్జీలు వసూలు చేస్తారు. పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి కంపెనీల నుంచి పెట్టుబడులు ఆహ్వానిస్తారు. ఈ విధానం పేద రైతులకు వ్యతిరేకమైనదిగా గుర్తించాలి. అప్పుడు సాగునీరు చాలా ఖరీదైనదిగా మారుతుంది. ఇకపోతే విత్తన బిల్లు 2025' చూస్తే రైతులకు ఆందోళన కలుగుతుంది. విద్యుత్ సవరణ చట్టం 2025' ప్రకారం మొత్తం విద్యుత్ వ్యవస్థను ప్రైవేటీకరించడం ప్రధానాంశం. ఐదు సంవత్సరాలలో క్రాస్ సబ్సిడీని రద్దు చేయాలనేది మరో కీలకాంశం. ఇది మెట్ట ప్రాంతాలలో, గిరిజన ఏరియాలో, వెనుకబడ్డ ప్రాంతాలలో చిన్న రైతుల పంపుసెట్లు, లిఫ్టుల వ్యవసాయాన్ని బాగా దెబ్బతీస్తుంది. ఎరువుల విధానం 2025' ప్రకారం ఎరువులపై ప్రభుత్వ నియంత్రణ తొలగించారు. సకాలంలో రైతులకు అందక పోయినా, ఉండాల్సిన నాణ్యత లేకపోయినా, ధర పద్ధతులలో తేడాలున్నా ప్రభుత్వ యంత్రాంగానికి బాధ్యత లేదు. ఇప్పుడు ఈ విధానంలో అదనంగా నానో లిక్విడ్ యూరియాను ప్రవేశ పెట్టింది. దాంట్లో నత్రజని 45 శాతం నుంచి 4 శాతానికి తగ్గుతుంది. యూరియాపై ప్రభుత్వ సబ్సిడీ మొత్తం తగ్గించి నగదు బదిలీ పథకం పెట్టాలని కేంద్రం రాష్ట్రాలను కోరుతోంది. నానో యూరియా తీసుకున్న రాష్ట్రంలో బస్తాకు రూ.800 సబ్సిడీ ఇస్తానని ప్రకటించింది. ప్రకృతి విపత్తుల చట్టం 25, సెక్షన్ 12లో బాధితులను ఆదుకోవడానికి వున్న సూచనలు తొలగించారు. సెక్షన్ 13లో పంటలు కోల్పోయిన రైతులకు చెందిన రుణాలు వాయిదా వేసి తిరిగి పంట రుణాలు రీషెడ్యూల్ చేసే చాప్టర్‌ను తొలగించారు.

# టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

### అన్ని కేంద్రాలను సిద్ధం చేసిన అధికారులు

**వరంగల్,**

వరంగల్ జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 14 నుంచి ఏప్రిల్ 13 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఈ నెల 14 లోగా విద్యార్థులను పరీక్షలకు సమాయత్తం చేసే పనిలో జిల్లా విద్యా శాఖ నిమగ్నమైంది. జిల్లాలో పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ ఇప్పటికే పలుదఫాలుగా సమన్వయ సమావేశాలు నిర్వహించారు. అందుకు అనుగుణంగా విద్యాశాఖాధికారులు ఏర్పాట్లను సైతం పూర్తి చేశారు. ఈ ఏడాది జిల్లాలో 288 పాఠశాలల నుంచి మొత్తం 9,492 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పది ఫలితాల్లో జిల్లాను ముందంజలో ఉంచేం దుకు ఇప్పటికే ప్రణాళికబద్ధమైన పటిష్టమైన చర్యలను విద్యా శాఖ చేపట్టింది. స్పెషల్ క్లాసులు, రివిజన్ క్లాసులు, నిపుణులతో విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహిస్తోంది. జిల్లాలోని 288 పాఠశాలల నుంచి 9,492 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో 4,932 మంది బాలురు పరీక్షలకు హాజరు కానుండగా 4560 మంది బాలికలు పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో అన్ని వసతులతో కూడిన 47 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 47 మంది సీఎస్, 48 మంది డీవోలను, 47మంది సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ప్రశ్నాపత్రాల బట్వాడ కోసం ఆరుగురు రూట్ ఆఫీసర్లు, మరో ఆరుగురు అదనపు రూట్ ఆఫీసర్లను నియమించారు. ముగ్గురు సభ్యులతో కూడిన మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, 496 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఇక 22 పరీక్షా కేంద్రాల్లో శాశ్వత సీసీ కెమెరాలు ఉండగా, మిగిలిన 25 కేంద్రాల్లో తాత్కాలిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచి రాష్ట్ర స్థాయిలోనే జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లతో పరీక్షలకు అనుమతిస్తారని, హెడ్మాస్టర్ల సంతకాలతో అవసరం లేదని డీఈవో రంగయ్య స్పష్టం చేశారు. వరంగల్ జిల్లాను పదవ తరగతి ఫలితాల్లో ముందంజలో ఉంచుతామని అన్నారు. ప్రత్యేకమైన ప్రణాళికతో విద్యార్థులను పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధం చేసామని, విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలకు హాజరు కావాలన్నారు.

RNI.No. TELTEL/2010/32434
ఎడిటర్ : గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# ప్రజాస్వామ్య పునరుద్ధరణోద్యమం

జాతీయ స్వాతంత్ర్య పోరాట కాలంలోనూ, ఆ తరువాత ఎమర్జెన్సీలోనూ, ఆ మాటకొస్తే దేశానికి ముప్పు వచ్చిన ప్రతి సందర్భంలోనూ కీలకమైన ప్రజా ఉద్యమాలకు వేదికైన ప్రాంతం బీహార్! దేశానికి కష్టకాలంలో ఐక్యంగా అండగా నిలబడటంతో పాటు పలు మార్లు దేశానికి అవసరమైన రాజకీయ చైతన్యాన్ని బీహార్ ప్రజలు ప్రదర్శించారు. ఆ బీహార్‌లోనే ప్రస్తుతం ప్రజాస్వామ్య పునరుద్ధరణోద్యమం సాగుతోంది. ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో జరిగిన 'ఓటర్ అధికార్ యాత్ర'కు ప్రజల నుండి లభించిన విశేషమైన మద్దతే దీనికి నిదర్శనం. 25 జిల్లాల్లో 1300 కిలోమీటర్ల మేర సాగిన ఈ యాత్రలో ఇండియా బ్లాక్ పార్టీలు, బీహార్‌లో ఉన్న అనేక ఇతర పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలపడంతో పాటు, అన్ని విధాలా సహకరించాయి. పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రజలు ఈ యాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీహార్ రాజధాని పాట్నాలో జరిగిన ముగింపు సభలో రెండు లక్షలకుపైగా ప్రజలు పాల్గొన్నారని అంచనా! అనేక చారిత్రాత్మక సంఘటనలకు వేదికైన గాంధీ మైదాన్‌లో ఈ సభ జరిగింది. సభకు హాజరైన వారు తమ ఓటు హక్కును హరిస్తున్న మోడీ ప్రభుత్వంపై ఆగ్రహంతో చేసిన నినాదాలు బీహార్ అంతా మారుమోగాయి. 'ఓటు హక్కు మా స్వంతం. దాన్ని దోచుకోవడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించం' అన్న గట్టి హెచ్చరికను ఈ సభ ద్వారా సాధారణ ప్రజానీకం కేంద్ర ప్రభుత్వానికి చేసింది. ఇప్పటి వరకు బిజెపి-జెడియు ప్రభుత్వంపై నెలకొన్న వ్యతిరేకతను చూసీ చూడనట్టు ఊరుకున్న కొన్ని మీడియా సంస్థలు కూడా 'ఓటర్ అధికార్ యాత్ర' ముగింపు తర్వాత తమ వైఖరిని మార్చుకోవాల్సి వచ్చింది. ముఖ్యంగా ముగింపు సభ తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధోరణులు ఇదే మాదిరి కొనసాగితే వాటి పునాదులు కదులుతాయన్న సంకేతాలు మీడియా విశ్లేషణల్లో వెలువడుతుండటం గమనార్హం.



నిజానికి, బీహార్‌లో అధికార భాగస్వామిగా కొనసాగడానికి బిజెపి ఎన్నో టక్కుటమార విద్యలను ప్రదర్శించింది. అనైతిక మార్గాలను అనుసరించింది. తీవ్ర హిందుత్వ విధానాలతో ప్రజలను నిట్టనిలువునా చీల్చడానికి ప్రయత్నించింది. పహల్గాం ఉగ్రదాడిని కూడా ఎన్నికల రాజకీయాలకు ప్రధాని మోడీ వాడుకున్న తీరు ప్రస్తుతం బీహార్‌లో చర్చనీయాంశమైంది. ఇంత చేసినా అధికారంలో ఎక్కువ కాలం కొనసాగలేమన్న భావనతోనే ఓట్ల కుంభకోణానికి బిజెపి తెర తీసిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికల సంఘాన్ని ఆయుధంగా చేసుకుని, మైనారిటీలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మహిళలు వీరందరికీ ఓటు హక్కు నిరాకరించడం. అధికార కూటమి అనుచరులు ఇష్టానుసారంగా ఓటు వేసేలా అనుమతిస్తూ తీసుకున్న పలు చర్యలు ఒక దాని తరువాత ఒకటిగా వెలుగులోకి వస్తున్నాయి. వెలుగులోకి వస్తున్న అంశాలకు తగిన విధంగా స్పందించి, సమస్యలను పరిష్కరించడానికి బదులుగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ బిజెపి నేతల భాషలోనే ప్రతిపక్షాలపై దాడి చేయడం చర్చనీయమవుతోంది. బీహార్ నమూనాలోనే ఇతర రాష్ట్రాలలో కూడా ఓటర్ల జాబితా సవరణకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టడంతో బిజెపి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్న అభిప్రాయం రోజురోజుకు బలపడుతోంది. ఈ నేపథ్యంలోనే రాజ్యాంగ బద్ధమైన హక్కులను కాపాడుకునేందుకు ఐక్యంగా కదలాలన్న ప్రతిపక్ష విజ్ఞప్తికి ప్రజల నుండి సానుకూల స్పందన లభిస్తోంది. 'ఓటర్ అధికార్ యాత్ర' ముగింపు సభ జరిగిన తీరే దీనికి నిదర్శనం. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, బీహార్ శాసనసభ ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్‌ల ఆధ్వర్యంలో సాగిన యాత్రకు వామపక్షాలు గట్టి మద్దతు ప్రకటించాయి. ఆ పార్టీల రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు ఈ యాత్రలో భాగస్వాములయ్యారు. ముగింపు సభకు సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబి హాజరయ్యారు. స్వతంత్ర భారత దేశంలో ఎన్నికల సంఘం యొక్క విశ్వసనీయత ఇంతగా గతంలో ఎప్పుడూ ప్రశ్నార్థకం కాలేదు. బిజెపి ఆదేశాలను అమలు చేసే ఆయుధంగా ఎన్నికల సంఘం మారిపోవడాన్ని దేశ ప్రజానీకం ఎన్నటికీ అంగీకరించరు. ఓటు దోపిడీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరగబోయే ఆందోళనలకు బీహార్‌లో జరిగిన యాత్ర కేవలం ఆరంభం మాత్రమే!

# మార్కెట్లోకి న్యూ హార్నెట్ 125, షైన్ 100 డిఎక్స్

## ఆవిష్కరించిన రవాణా, యూత్ అండ్ స్పోర్ట్స్ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

అనంతపురం : అనంతపురం ఆర్ ఎఫ్ రోడ్ లోని శివ సాయి హెూండా షోరూంలో ఇటీవల హెూండా సంస్థ రూపొందించిన న్యూ హార్నెట్ 125, షైన్ 100 డిఎక్స్ సరికొత్త ద్విచక్ర మోడల్స్ ను రాష్ట్ర రవాణా, యూత్ అండ్ స్పోర్ట్స్ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ %ౌ% యువతకు నచ్చే విధంగా హెూండా సంస్థ వాహనాలను రూపొందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా శివ సాయి హెూండా సంస్థ 21 సంవత్సరాలుగా సుదీర్ఘమైన సేవలు అందించి ప్రజల ఆదరణ పొందడం అభినందనీయమన్నారు. ఈ నేపథ్యంలో 21 వ వార్షికోత్సవం సందర్భంగా తీసిన లక్కీ డ్రా లో సత్య సాయి జిల్లా చెన్నే కొత్తపల్లికి చెందిన వంశీకృష్ణకు లక్కీ డ్రాలో లభించిన ఆపిల్ మొబైల్ ను మంత్రి చేతుల మీదుగా అందించారు. ఈ నేపథ్యంలో శివ సాయి హెూండా అధినేత మల్లికార్జున



మాట్లాడుతూ వాహనదారులకు శివ సాయి హెూండా రెండు దశాబ్దాలుగా సేవలందించి ఆదరణ పొందామని చెప్పారు. భవిష్యత్తులోనూ నాణ్యమైన నమ్మకమైన సేవలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ వీర్రాజు, సిటీ యూనియన్ బ్యాంకు మేనేజర్ రాజేష్ శివ సాయి హెూండా సేల్స్ మేనేజర్ శేషాద్రి, సర్వీస్ మేనేజర్ షఫీ, టాటా గోల్డ్ ఇన్చార్జ్ రావు, శివ సాయి హెూండా అకౌంటెంట్ రాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఖర్చులతో సతమతం

## అయోమయంలో 58 శాతం కుటుంబాలు

## వాల్డ్‌పానెల్ బై నుమెరేటర్ రిపోర్ట్

న్యూఢిల్లీ :

పెరిగిన ధరలు, ఖర్చులతో దేశంలోని సగంపైగా కుటుంబాలు సతమతం అవుతోన్నాయి. ఖర్చులను ఎలా అధిగమించాలో అర్థం కావడం లేదని 58 శాతం కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేశాయని వాల్డ్‌పానెల్ బై నుమెరేటర్ రిపోర్ట్‌లో తెలిపింది. వినియోగదారులు ట్రెండ్స్‌ను పరిశోధించే ఈ గ్లోబల్ రీసెర్చ్ సంస్థ 6,000పైగా కుటుంబాల అభిప్రాయాలతో.. ఖర్చా 3.0 అనే అధ్యయనం చేసింది. ఆ వివరాలు.. 2025 మార్చితో ముగిసిన త్రైమాసికంలో భారతీయుల కుటుంబాల సగటు వ్యయాలు 14 శాతం పెరిగి రూ.56,135కు చేరింది. ఇది ఆదాయం కంటే ఎక్కువని వెల్లడించింది. 2022లో సగటు త్రైమాసిక ఖర్చులు సుమారు రూ.42,000గా ఉన్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలు, తక్కువ ఆదాయాలు గల వర్గాలు ఖర్చులలో ఏకంగా 18 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. అదే విధంగా నగరాల్లోని ఉన్నత ఆదాయ కుటుంబాల్లో కూడా త్రైమాసిక ఖర్చులలో 15 శాతం పెరుగుదల నమోదయ్యింది. భారతీయ కుటుంబాల్లో గత మూడేళ్లలో ఆర్థిక ఒత్తిడి విపరీతంగా పెరిగింది. వినియోగదారులు అవసరమైన ఖర్చులను, రుణ బాధ్యతలను సమతుల్యం చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. "ఖర్చులు పెరుగుతున్న నగర, గ్రామీణ ప్రాంతాల్లో చాలా కుటుంబాలు అవసరమైన వస్తువులు, పొదుపు, రుణ చెల్లింపులకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. వినియోగదారులు తమ ఎంపికలలో మరింత జాగ్రత్తగా ఉంటున్నారు. బ్రాండ్‌లకు ఇది ఒక కీలక సమయం. వారు వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సరసమైన, అవసరమైన, బాధ్యతాయుతమైన విలువను అందించే విధంగా తమ వ్యూహాలను రూపొందించాలి." అని వరల్డ్‌ప్యానల్ బై న్యూమరేటర్ సౌత్ ఆసియా మేనేజింగ్ డైరెక్టర్ కె రామకృష్ణన్ అన్నారు. దేశంలోని 58 శాతం కంటే ఎక్కువ గృహాలు ఖర్చులను నిర్వహించడంలో ఇబ్బంది పడుతున్నాయని తమ రిపోర్ట్‌లో తేలిందన్నారు. ఇది గత సంవత్సరం 38 శాతంతో పోల్చితే చాలా ఎక్కువన్నారు. కేవలం 17 శాతం కుటుంబాలు మాత్రమే సౌకర్యవంతంగా జీవిస్తున్నాయన్నారు. మిగిలినవారు ఏదో విధంగా ఖర్చులను నిర్వహిస్తున్నాయన్నారు. బడ్జెట్‌లు కుంచించుకుపోతుండటంతో భారతీయ వినియోగదారులు తమ ఖర్చులను ప్రాథమిక అవసరాలపై కేంద్రీకరిస్తున్నారన్నారు. సుమారు 80 శాతం మంది అవసరమైన కిరాణా సామాగ్రిని మాత్రమే కొంటున్నట్లు తెలిపారు. చాలా మంది చౌకైన బ్రాండ్‌లకు మారుతున్నారు. ఆకస్మిక కొనుగోళ్లను తగ్గిస్తున్నారన్నారు.



RNI.No. TELTEL/2010/32434
ఎడిటర్ : గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

## బిజినెస్..

# పేపర్‌పై 18 శాతం జిఎస్‌టి అనుచితం

## కాగితం విలాస వస్తువు కాదు

## తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ ఆందోళన

బిజినెస్ బ్యూరో : కేంద్ర ప్రభుత్వం కాగితంపై 18 శాతం వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వేసిందని.. ఇది అనుచితమని తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు అభిషేక్ విజయవార్జి అన్నారు. పేపర్ విలాస వస్తువు కాదని.. ఇది అత్యవసర వస్తువని ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, ప్రచురణకర్తలు, ప్రింటర్లు, ప్యాకేజింగ్ పరిశ్రమ సహా సమాజంలో ఎంతో మంది ప్రతిరోజూ ఉపయోగించే ఒక అత్యవసర వస్తువు కాగితం అన్నారు. దీనిపై ఇటీవల జిఎస్‌టిని 18 శాతానికి పెంచడం వల్ల విద్య, సంబంధిత పరిశ్రమలపై అధిక భారం పడుతుందన్నారు. కాగితం కేజీ రూ.70, జిఎస్‌టి ఐదు శాతం కలిపితే రూ.73.50 అవుతుందన్నారు. అదే 18 శాతం జిఎస్‌టి అయితే రూ.82.60 అవుతుందన్నారు. కిలోపై అదనంగా 12 శాతం భారం పడనుందన్నారు. నూతన జిఎస్‌టితో నోటుబుక్స్, పాఠ్య పుస్తకాలు, పరీక్ష పత్రాలు, ప్యాకేజింగ్, రోజువారీ ఉత్పత్తులపై అనేక రెట్లు పెరుగుతుందని చెప్పారు. దేశంలో కాగితం పరిశ్రమ అడవులను నరకడం లేదన్నారు. సొంతంగా చెట్లను సాగు చేస్తుందన్నారు. కాగితంపై జిఎస్‌టిని 5 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు.



# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్..

??. నేడు ప్రజా పాలనబి ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా సర్పంచులు,




మున్సిపల్ వార్డు సభ్యులు, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కార్పొరేషన్ మేయర్ల కు శిక్షణ కార్యక్రమం..
మీ.
శ్రీమతి చింతల నిర్మల గోవర్ధన్ రెడ్డి గారు.
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళ వైస్ ప్రెసిడెంట్







ఈరోజు కోకాపేటలోని,మెడికవర్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ ముఖ్యమంత్రివర్యులు గౌరవ శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు మరియు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మాత్యులు గౌరవ శ్రీ దామోదర రాజనర్సింహ గారితో పాటు హాజరై,మెడికవర్ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాగార్జునసాగర్ శాసనసభ్యులు గౌరవ శ్రీ కుందూరు జయవీర్ రెడ్డి గారు




# పవిత్ర రంజాన్ ప్రార్థనలో పాల్గొన్న అనిల్ కుమార్ యాదవ్







అన్వేషనేత్రం ప్రతినిధి

శేరిలింగంపల్లి నియోజకవర్గం మజీద్ బండ ప్రాంతంలో మారబోయిన మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో రంజాన్ ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ముస్లిం సమాజానికి హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు శాంతి, కరుణ మరియు సమగ్ర అభివృద్ధి యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సామరస్యపూర్వక సమాజాన్ని నిర్మించడానికి అవసరమైన దాతృత్వం, సహనం మరియు మానవాళికి సేవ చేయడం వంటి విలువలను రంజాన్ బోధిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పలువురు నాయకులు, మాత పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# సుధా బ్యాంక్ పనితీరుకు ఫైవ్ స్టార్ రేటింగ్ తార్నాకం- ఐపిఎస్ ట్రైని ఆకెళ్ళ రాఘవేంద్ర



## సుధా బ్యాంక్ పనితీరు తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంలిఆకెళ్ళ రాఘవేంద్ర

**సూర్యాపేట, మార్చ్ 13, అన్వేషనేత్రం:**

శుక్రవారం నాడు సుధా బ్యాంక్ 52వ సర్వసభ్య సమావేశం స్థానిక త్రివేణి ఫంక్షన్ హాల్ లో వాటాదారుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ సమావేశం లో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ సుధా బ్యాంకు కి ఫైవ్ స్టార్ రేటింగ్ పురస్కార ప్రధానం చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మోటివేషనల్ ట్రైనర్ ఆకెళ్ళ రాఘవేంద్ర మాట్లాడుతూ సుధా బ్యాంక్ సాధించిన ఈ ఘనత సూర్యాపేట జిల్లా కే కాదు యావత్తు తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం అని చెప్పారు. అద్భుతమైన పనితీరుకు క్రమశిక్షణకు ప్రామాణికంగా ఫైవ్ స్టార్ రేటింగ్ ఇచ్చారని బ్యాంకుతో అనుబంధం కలిగిన ప్రతి ఒక్కరూ గర్వపడే పర్వదినం ఇది అని ఆయన చెప్పారు. సుధా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ నిర్వహణలో ప్రతి సంవత్సరము ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ సుధా బ్యాంక్ అగ్రశ్రేణి బ్యాంకుగా ముందుకు వెళుతుందని ఆయన ఆశించారు. బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ అధ్యక్షతన జరిగిన ఈ సర్వసభ్య సమావేశానికి బ్యాంకు పాలకవర్గ సభ్యులు ,బ్యాంక్ మేనేజ్మెంట్ బోర్డ్ సభ్యులు
వైస్ చైర్మన్ కక్కిరేణిచంద్రశేఖర్, డైరెక్టర్స్ ఏపూరి శ్రవణ్ కుమార్ డాక్టర్ మీలా సందీప్ ,అప్పం శ్రీనివాస్ తోట శ్యాం ప్రసాద్, డాక్టర్ మిన్న విజయలక్ష్మి, అనంతుల శారద, బాణావత్ సుజాత, స్వామి వెంకటేశ్వర్లు ఇరుకుల్లా చెన్నకేశవ రావు వెంపటి వెంకటరమణ, రింగు లక్ష్మీనారాయణ, భువనగిరి భాస్కర్ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో వాటాదారుల పక్షాన గండూరి శంకర్, పెద్దిరెడ్డి రాజా ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సహకార శాఖ డిప్యూటీ రిజిస్టర్ శ్రీమతి ఇందిరా, పర్యవేక్షణ చేశారు.

# మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసిన చిన్న పత్రికల సంఘం నేతలు

## పెండింగ్ బిల్లుల అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లిన ప్రతినిధులు

## త్వరలో వచ్చి కలవాలని సూచించిన మంత్రి

అన్వేషనేత్రం ప్రతినిధి

శుక్రవారం అమీర్‌పేట్‌లో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును చిన్న పత్రికల సంఘం అధ్యక్షుడు యూసూఫ్ బాబు ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం కలిసి మాట్లాడింది. ఈ సందర్భంగా చిన్న పత్రికలకు సంబంధించిన పెండింగ్ బిల్లుల అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా, త్వరలో వచ్చి కలవాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో యూసూఫ్ బాబు గారితో పాటు అశోక్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు. మంత్రి గారికి తమ సమస్యను వివరించే అవకాశం లభించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు








## సాయిబాబా ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు











**నకిరేకల్ :-అన్వేషనేత్రం ప్రతినిధి**

నకిరేకల్ పట్టణంలోని శ్రీ సాయిబాబా ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం చెర్మన్‌గా నూతనంగా ఎన్నికైన తునపునూరి శ్రీనివాస్ గారి ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో గౌరవ నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా నూతన చెర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ గారికి ఎమ్మెల్యే గారు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, ఆలయ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు . భక్తులకు మరింత సౌకర్యాలు కల్పిస్తూ ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు..

## ఘనంగా నిర్వహించిన మొల్లమాంబ జయంతి

**నకిరేకల్ :-అన్వేషనేత్రం ప్రతినిధి**

నకిరేకల్ పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన



మొల్లమాంబ జయంతి కార్యక్రమంలో గౌరవ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారుఈ సందర్భంగా మహాకవయిత్రి మొల్లమాంబ గారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె సాహిత్య సేవలు, తెలుగు భాషకు చేసిన కృషి చిరస్మరణీయమని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు



## దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ








**నకిరేకల్ :-అన్వేషనేత్రం ప్రతినిధి**

నకిరేకల్ పట్టణానికి చెందిన దివ్యాంగులు పల్స రవికుమార్, పెండెం అంజనేయులు గారికి ప్రభుత్వం ద్వారా మంజూరైన ప్రత్యేక స్కూటీలను గౌరవ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు ప్రారంభించి వారికి అందజేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, వారి స్వావలంబనకు తోడ్పడే విధంగా పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు స్కూటీలు అందుకోవడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం మరియు ఎమ్మెల్యే గారికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.









## విద్యార్థులు., ఉపాధ్యాయులుగా..












**నకిరేకల్ పట్టణం :-**

నకిరేకల్ పట్టణంలోని వి.వి.ఎం స్కూల్ లో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉద్దీపన ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్, నకిరేకల్ గౌరవ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించి తరగతుల్లో పాఠాలు బోధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులు ఎంతో ఆత్మవిశ్వాసంతో, స్పష్టతతో పాఠాలను వివరించడం ఎమ్మెల్యే గారిని ఆకట్టుకుంది. విద్యార్థులు బోధిస్తున్న విధానాన్ని ఆసక్తిగా పరిశీలించి వారిని అభినందించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావం, క్రమశిక్షణ మరియు స్వీయ నియంత్రణ పెంపొందించేందుకు ఇలాంటి స్వపరిపాలన కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను సాధిస్తూ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు చేపడుతున్న వినూత్న కార్యక్రమాలను ఎమ్మెల్యే గారు ప్రశంసించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు అందిస్తున్న మార్గదర్శకత్వం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



ఈరోజు పెళ్లి రోజు సందర్భంగా తొర్రూర్ మాజీ సర్పంచ్ 6 వ వార్డ్ కౌన్సిలర్ పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీమతి శ్రీ పెదగాని కళావతి సోమన్న గారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన మురళి , ప్రకాష్ , పరశురాములు మరియు కృష్ణవేణి తదితరులు శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

## శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు





అన్వేషనేత్రం ప్రతినిధి

ఈరోజు తొర్రూర్ మాజీ సర్పంచ్ తొర్రూర్ మున్సిపాలిటీ 5 మరియు6వ వార్డ్ కౌన్సిలర్స్ పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీమతి శ్రీ పెదగాని కళావతి సోమన్న మరియు చాపల బాపురెడ్డి గారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన ఆధార్ నిర్వాహకులు తాటికొండ రామ్మూర్తి జక్కుల శంకర్ మరియు (డబ్బా)సోమయ్య తదితరులు శాలువాతో సత్కరించడం జరిగింది.

## వివాహ మహోత్సవ వేడుకల్లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షురాలు శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి



అన్వేషనేత్రం ప్రతినిధి

రామేశ్వరం ఉప సర్పంచ్ ఎల్లోజి గారి కుమార్తె వివాహ మహోత్సవ వేడుకల్లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షురాలు శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి గారు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారుబి . ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి గారులి మాట్లాడుతూ వివాహం అనేది రెండు కుటుంబాలను కలిపే పవిత్రమైన బంధమని అన్నారు. కొత్తగా వివాహ బంధంలో అడుగుపెట్టిన వధూవరులు పరస్పర గౌరవం, ప్రేమ, నమ్మకంతో తమ జీవితాన్ని ఆనందంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆశీర్వదించారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు వివాహ వేడుకలకు హాజరై కుటుంబ సభ్యులతో ముచ్చటించి వారి ఆనందంలో భాగస్వామ్యం అయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, మండల నాయకులు నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## వివాహ మహోత్సవ వేడుకల్లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షురాలు

అన్వేషనేత్రం ప్రతినిధి

గిర్ని తండా సర్పంచ్ సుదీర్ నాయక్ గారి వివాహ మహోత్సవ వేడుకల్లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షురాలు శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి గారు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారుబి . ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి గారులి మాట్లాడుతూ వివాహం అనేది రెండు కుటుంబాలను కలిపే పవిత్రమైన బంధమని అన్నారు. కొత్తగా వివాహ బంధంలో అడుగుపెట్టిన వధూవరులు పరస్పర గౌరవం, ప్రేమ, నమ్మకంతో తమ జీవితాన్ని ఆనందంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆశీర్వదించారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు వివాహ వేడుకలకు హాజరై కుటుంబ సభ్యులతో ముచ్చటించి వారి ఆనందంలో భాగస్వామ్యం అయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, మండల నాయకులు నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఉచిత గాలి కుంటా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాం











అన్వేషనేత్రం ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ, జనగాం జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గాలి కుంటా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని గౌరవ పాలకుర్తి శాసనసభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జనగాం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గారు కూడా హాజరై కార్యక్రమాన్ని పరిశీలించారు..ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు మాట్లాడుతూ.. పశుసంవర్ధక రంగం రైతులకు ముఖ్యమైన ఆదాయ వనరుగా మారిందని తెలిపారు. వ్యవసాయంతో పాటు పశుపోషణను కూడా అభివృద్ధి చేసుకుంటే రైతులు ఆర్థికంగా మరింత బలపడతారని పేర్కొన్నారు. పశువుల ఆరోగ్యం కాపాడటం చాలా ముఖ్యమని, గాలి కుంటా వంటి అంటువ్యాధులు సోకితే పశువులకు తీవ్ర నష్టం కలుగుతుందని అన్నారు. అందుకే ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తగా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు..పశువులలో గాలి కుంటా వ్యాధి వ్యాప్తిని అరికట్టడానికి పశువైద్య శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతుందని, ప్రతి గ్రామంలో పశువులకు టీకాలు వేయడానికి వైద్య బృందాలను పంపుతున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. పశువుల ఆరోగ్యం బాగుంటేనే పాలు, పాల ఉత్పత్తులు పెరుగుతాయని, రైతులకు అదనపు ఆదాయం వస్తుందని ఆమె పేర్కొన్నారు..రాష్ట్ర ప్రభుత్వం రైతులు మరియు పశుపోషకుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు తెలిపారు. పశుసంవర్ధక రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు కూడా ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరించి పశువుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వారు సూచించారు..ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గారు మాట్లాడుతూ పశువైద్య శాఖ అధికారులు గ్రామాల వారీగా టీకాల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి రైతు తన పశువులకు టీకాలు వేయించుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు..ఈ కార్యక్రమంలో పశువైద్య శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు మరియు పశుపోషకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు పశువులకు టీకాలు వేస్తున్న విధానాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు..

## రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన


మునుగోడు నియోజకవర్గం:-అన్వేషనేత్రం ప్రతినిధి

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మునుగోడు మండలం కల్వకుంట్ల గ్రామంలో 3 కోట్ల రూపాయల వ్యయంతో కల్వకుంట్ల నుండి చండూరు మండలం కొండాపురం వరకు వయా వెంకటేశ్వర్ నగర్ కు నిర్మించే రోడ్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం గారితో కలిసి శంకుస్థాపన చేసిన గౌరవ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి





పాలకుర్తిలో వేటా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకగా జరిగింది. ఫౌండర్ అండ్ చైర్ పర్సన్ ఝాన్సీ రెడ్డి గారి నేతృత్వంలో జరిగిన ఈ ఉత్సవానికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహిళా సాధికారతే లక్ష్యంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి









RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గొల్ల రమేష్ తెలుగు దినపత్రిక

# ఆట






# ధోనీ ఈ సీజన్ అంతా ఆడుతాడు

## సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథ్ ప్రకటన

ఐపీఎల్ 2026 సందడి మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. ఇప్పటికే స్టార్ ప్లేయర్లంతా సన్నద్ధ మవుతున్నారు. అయితే ఐపీఎల్ అనగానే అభిమానుల్లో మెదిలేది ఒక్కటే ప్రశ్న.. క్రికెట్ దిగ్గజం ఎంఎస్ ధోనీ బరిలోకి దిగుతాడా? లేదా? చెన్నై సూపర్ కింగ్స్‌ను ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిపిన ధోనీపైనే ఈసారి కూడా అందరి దృష్టి ఉంది. ఈ నేపథ్యంలో సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథ్ ఓ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సీజన్‌లో ధోనీ ఆడనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. 'ఎంఎస్ ధోనీ ఈ సీజన్‌లోనూ ఆడతాడు. అన్ని మ్యాచుల్లోనూ బరిలోకి దిగుతాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వినియోగిస్తారా? అంటే దాని గురించి నేనేం మాట్లాడలేను. అది క్రికెట్‌కు సంబంధించిన నిర్ణయం. స్టాఫ్ ఈ నిర్ణయం తీసుకుంటారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ తీసుకునేది కాదు. బ్యాటర్‌గా ఆడతాడా? వికెట్ కీపర్ కమ్ బ్యాటర్‌గానా? ఇంపాక్ట్ ప్లేయర్‌గానా? అనేది వారు డిసైడ్ చేస్తారు' అని స్పష్టం చేశారు. 'టీమిండియా వరుసగా రెండు టీ20 ప్రపంచ కప్‌లను నెగ్గడం సంతోషంగా ఉంది. అందులో సీఎస్కే ప్లేయర్లు సంజు శాంసన్, శివమ్ దూబే అద్భుతంగా ఆడారు. వారి స్ఫూర్తితో ఐపీఎల్‌లో సీఎస్కే ఆటగాళ్లు ఉత్తమ ప్రదర్శన చేస్తారని భావిస్తున్నా. ఇక మా మ్యాచులన్నింటినీ చెన్నై వేదికగా ఆడతాం. తమిళనాడు ఎన్నికల నేపథ్యంలో.. ఆటగాళ్ల ప్రయాణానికి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. పూర్తి స్థాయి షెడ్యూల్ కోసం మేమూ వేచి చూస్తున్నాం' అని తెలిపారు.




# ఐసీసీ తాజాగా టీ20 ర్యాంకింగ్స్ ప్రకటన

):టీ20 ప్రపంచ కప్ 2026ను టీమిండియా ఘనంగా ముగించింది. వరుసగా రెండోసారి కప్‌ను ముద్దాడిన జట్టుగా చరిత్ర సృష్టించింది. ఈ నేపథ్యంలో ఐసీసీ తాజాగా టీ20 ర్యాంకింగ్స్ జాబితాను ప్రకటించింది. ఇందులో భారత బ్యాటర్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ సత్తా చాటారు. అభిషేక్ శర్మ తన స్థానాన్ని పదిలపర్చుకుని అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. కాగా టోర్నీ ఆసాంతం అద్భుత ప్రదర్శనలు చేసిన ఇషాన్ కిషన్ రెండోస్థానానికి దూసుకొచ్చాడు. టీ20 ప్రపంచ కప్‌లో అభిషేక్ శర్మ ఆరంభంలో ఫామ్ లేమితో తీవ్ర ఇబ్బందులు పడ్డాడు. అతడి ప్రదర్శనతో టీ20 ర్యాంకింగ్స్‌లో అతడి స్థానాన్ని కోల్పోవచ్చనే చర్చ కూడా జరిగింది. ఎట్టకేలకు ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసి అదరగొట్టాడు. దీంతో అతడి స్థానంలో పదిలం అయింది. 875 పాయింట్లతో అభిషేక్ శర్మ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

# వరుసగా రెండు విజయాలు

:కేవలం 2 ఏళ్ల వ్యవధిలో కప్ గెలిచిన ఆనందం అంతా ఇంతా కాదు. సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య, బుమ్రా, ఇషాన్ కిషన్, శివమ్ దూబె, సంజు శాంసన్, అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, సిరాజ్‌లకు ఆ అవకాశం దక్కింది. 2024లో వెస్టిండీస్, అమెరికా వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్‌లో భాగమైన వీళ్లందరూ.. 2026లో సొంతగడ్డపై మరోసారి కప్ అందుకొని మురిసిపోయారు. దక్షిణాఫ్రికాతో ఫైనల్లో సూర్యకుమార్ అద్భుతమైన క్యాచ్‌తో భారత్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. అదే సూర్య ఇప్పుడు భారత జట్టు కెప్టెన్‌గా జట్టుకు కప్ అందించాడు. బ్యాటర్‌గా పెద్ద ప్రభావం చూపకపోయినా.. కెప్టెన్‌గా అతడి ప్రణాళికలే జట్టును విజేతగా నిలిపాయి. లీగ్ దశలో అమెరికాపై జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు 49 బంతుల్లోనే 84 పరుగులు చేసి జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఇక బుమ్రా గురించి ప్రత్యేకంగా చెప్పేది ఏముంది. 2024లో 8 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసి జట్టు విజయంలో భాగమైన బుమ్రా.. ఈసారి సొంతగడ్డపై అదరగొట్టేశాడు. ఇంగ్లాండ్‌తో సెమీఫైనల్లో అతడు వేసిన స్పెల్‌ను వర్ణించేందుకు మాటల్లేవ్. ఈసారి టోర్నీలో 14 వికెట్లు పడగొట్టి ఉమ్మడి అత్యధిక వికెట్లు తీసిన వీరుడిగా నిలిచాడు.

RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గొల్ల రమేష్ తెలుగు దినపత్రిక



# సినిమా

CINEMA



# మహేశ్ అభిమానులకు హరీష్ క్షమాపణలు

సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానులకు దర్శకుడు హరీష్ శంకర్ క్షమాపణలు చెప్పాడు. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర ప్రమోషన్స్ సమయంలో జరిగిన ఒక చిన్న పొరపాటు ఈ వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. పవన్ కళ్యాణ్ అభిమాని ఒకరు ఎక్స్ వేదికగా ఈ సినిమా మహేష్ బాబు రికార్డులను బద్దలు కొట్టాలనే అర్థం వచ్చేలా ఒక పోస్ట్ చేశారు. దీనికి హరీష్ శంకర్ రిప్లై ఇవ్వడంతో మహేష్ బాబు అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన్ని ట్రోల్ చేయడం ప్రారంభించారు. ఈ వివాదం ముదరడంతో హరీష్ శంకర్ వెంటనే స్పందిస్తూ వివరణ ఇచ్చారు. షూటింగ్ పనుల్లో మరియు సెన్సార్ కార్యక్రమాల్లో బిజీగా ఉండటం వల్ల ఆ ట్వీట్‌ను పూర్తిగా చదవకుండానే, కేవలం అభిమాని ఉత్సాహాన్ని చూసి పొరపాటున స్పందించానని ఆయన పేర్కొన్నారు. తనకు మహేష్ బాబు అంటే ఎంతో గౌరవమని, గతంలో ఆయన నటించిన 'పోకిరి' సినిమా గురించి కూడా తాను ఎంతో పాజిటివ్‌గా మాట్లాడానని గుర్తుచేశారు. అంతేకాకుండా, రాజమౌళి- మహేష్ బాబు కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా పెద్ద రికార్డులు సృష్టించాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. తన రిప్లై వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే బేషరతుగా క్షమాపణలు కోరుతున్నానని హరీష్ శంకర్ ప్రకటించారు. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న సమయంలో తాను కావాలని ఇలాంటి వివాదాలు చేసే వ్యక్తిని కాదని ఆయన స్పష్టం చేశారు.





# ప్రభాస్‌తో ఎకో డైరెక్టర్ ఫోటో

ప్రస్తుతం సోషల్ మీడియాలో రెబల్ స్టార్ ప్రభాస్ మరియు మలయాళ సెన్సేషనల్ డైరెక్టర్ దిన్‌జిత్ అయ్యతాన్ కలిసి ఉన్న ఒక ఫోటో తెగ వైరల్ అవుతోంది. ఈ ఫోటో వీరిద్దరి కాంబినేషన్‌లో ఒక భారీ ప్రాజెక్ట్ పట్టాలెక్కబోతుందనే వార్తలకు బలం చేకురుస్తుంది. ఇటీవల 'కిష్కింధ కాండం' మరియు 'ఏకో' వంటి విభిన్నమైన సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన దిన్‌జిత్, స్వయంగా ప్రభాస్‌ను కలిసిన విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ప్రభాస్ ఆతిథ్యాన్ని, ముఖ్యంగా ఆయన వడ్డించిన రుచికరమైన 'ప్రాన్స్ బిర్యానీ'ని ప్రశంసిస్తూ దిన్‌జిత్ పెట్టిన ఇన్స్టాగ్రామ్ పోస్ట్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. ముఖ్యంగా ఈ సమావేశం వెనుక హోంబలే ఫిల్మ్స్ అధినేత విజయ్ కిరగందూర్ ఉండటం గమనార్హం. గతంలోనే హోంబలే సంస్థ ప్రభాస్‌తో మూడు సినిమాల భారీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో 'సలార్ 2' కాకుండా, మిగిలిన రెండు చిత్రాల్లో ఒకటి దిన్‌జిత్ దర్శకత్వంలో ఉండే అవకాశం ఉందని ఫిల్మ్ నగర్ టాక్ నడుస్తుంది. విలక్షణమైన థ్రిల్లర్లను తెరకెక్కించడంలో దిన్‌జిత్ సిద్ధహస్తుడు కావడంతో, ప్రభాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా ఒక సరికొత్త తరహా కథను ఆయన సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రభాస్ 'ఫౌజీ', 'స్పిరిట్' మరియు 'కల్కి 2' వంటి భారీ ప్రాజెక్టులతో ఎంతో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ క్రేజీ కాంబో ఎప్పుడు సెట్స్ పైకి వెళ్తుందనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ ఇద్దరి కలయికతో ఒక డిఫరెంట్ సినిమాను చూడవచ్చని అభిమానులు ఆశిస్తున్నారు.



# జునైద్ ఖాన్‌తో సాయిపల్లవి జోడీ

## ఏక్ దిన్ ట్రైలర్ విడుదల

బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ మరియు సౌత్ సెన్సేషన్ సాయి పల్లవి జంటగా నటించిన క్రేజీ చిత్రం 'ఏక్ దిన్'. ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందంవిడుదల చేసింది. ఈ సినిమాకు సునీల్ పాండే దర్శకత్వం వహిస్తుండగా ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. హీరోయిన్ కేవలం ఒకే ఒక రోజు హీరోతో ప్రేమలో గడపాలనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా రాబోతుండగా.. ఈ చిత్రం ద్వారా సాయి పల్లవి హిందీ తెరకు పరిచయం కాబోతోంది. రామ్ సంపత్ సంగీతం, అరిజిత్ సింగ్ గాత్రం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం మే 1, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది.

Printed Published and owned by Golla Ramesh, No.8-4-111, NG. Colony, Ramagiri, Nalgonda-508001 Telangana State, Printed at Prabhu publication H.No.6-4-111. NC Colony Ramaghir, Nalgonda-508001 Telangana State Publisheds H.No.6-4-111. NG. Colony, Ramagiri, Netponde-508001 Telanagan Stsos, Editor T Golla RN.No. TELTEL/201002434